


( గత సంచిక తరువాయి )

**5**

శివరావు దద్దాలోరి పల్లెకు వచ్చి యిది మూడోరోజు. రామి రెడ్డి, వెంకటసామి మొదలైన పెద్దలంతా చేరి పట్నపోళ్లు పల్లెల్లో రెండురోజులు కదలకుండా వుంటే ఏమీ తోచక వెర్రెత్తిపోతుంది గనుక శివరావును ఈరోజు చిన్నాతో చెర్లోపల్లెకు వెళ్లి హాయిగా కాల క్షేపం చేసుకురమ్మని సలహాయిచ్చారు. అక్కడ సినిమాహాలున్నది, హోటలున్నది, హైస్కూలున్నది, కూల్ డ్రింక్స్ దొరుకుతవి. ఈమధ్యనే చిన్న ఎగ్జిబిషన్ కూడా వచ్చింది. కాబట్టి అక్కడికెళ్తే బాగా ప్రొద్దు గడుస్తుందని తేల్చారు.

వాళ్లు చెప్పిన ఆకర్షణలేవీ శివరావును ఆకట్టుకోలేదు - చిన్నా మాత్రం యివన్నీ కొట్టిపారేసి, శివరావును ఎలాగైనా మదనపల్లెదగ్గరి 'నారాయణస్వామి గుహకి' తీసుకెళ్లాలనే దృఢనిశ్చయంతో వున్నాడు.

ఏభైఏళ్లవయసుగల నారాయణస్వామి చిన్నాకి వేలువిడిచిన మేనమామ. పెళ్లి, సంసారమూ లేదు. బాగానే చదువుకున్నాడు ఎం.ఏ. వరకూ. ఉద్యోగం, సద్యోగం చెయ్యకుండా తిరిగి, పరమ త్రాగుబోతై పోయి రంగూన్‌లో ఏడాది వుండి తిరిగి వచ్చాడు. అతనిలో ఏమి మార్పు ఎలా వచ్చిందో ఎవరికీ తెలీదు కాని అయిదేళ్ల క్రిందట మదన పల్లె దగ్గర్లోనే ఒక కొండ గుహలో చక్కగా గదిలాగా ఏర్పాటు చేసు కుని, అందులోనే నివసిస్తున్నాడు. త్రాగుడు పూర్తిగా ఒదిలేశాడు. అతనికి మనుషులంటే సరిపడదు. లేకుంటే గుహలో ఎందుకుంటాడు? అతను రేషనలిజంకు బద్ధవిరోధి. చాలా పుస్తకాలు చదివాడు. వాద నల్లో బహుమేటి. ఎప్పుడూ ఎదుటి వాళ్లను ఎద్దేవాచేస్తూ మాట్లాడే స్వభావం వున్నది. ముఖ్యంగా చిన్నాను చూస్తే ఎక్కడలేని సరదా పుట్టుకొస్తుంది. ఎప్పుడైనా బంధు బలగం ఏవైనా వస్తువులు ఆయ నకు చేర్చిరమ్మని బలవంత పెట్టినప్పుడు తప్ప చిన్నా అతని దగ్గరకు వెళ్లడు - ఈ విషయాలన్నీ గుహకు వెళ్తూ దోవలో శివరావుకు చెప్పాడు చిన్నా.

మదనపల్లెనుంచీ అనంతపురం వెళ్లే రోడ్డులో కొండల వరుసల్లో షుమారు ఎనిమిది కిలోమీటర్లు దాటాక ఎడమవైపుకు తిరిగితే అతి ప్రాచీనమైన స్థలపురాణంగల తెట్టు గ్రామంలో వేంచేసియున్న

శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, దాన్నానుకునే ఎత్తైనదీ, బహు సుందరమైనదీ అయిన హార్సిలీకొండ, కొండదిగువలోనే శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారి ఋషీవాలీ - దేనికదే సుప్రసిద్ధమైనది, దేనికదే విశిష్టమైనది. ఆ రోడ్డులో ఎడమవైపుకు తిరక్కుండా కుడివైపుకు తిరిగితే కనిపించే కొండలోనే నారాయణస్వామి గుహ.

గుహలోపల ఒక చిన్న గదిలాగా వున్నది. బయట రాతి కూసాలమీద చిన్న వసారా దించారు. దగ్గర్లో వున్న చెలమనుంచీ నీళ్లు తేవడానికీ, వంట చెయ్యడానికీ, ఇతర అవసరాలు చూడటానికి లంబాడీ కుర్రవాడొకడు వున్నాడు.

నారాయణస్వామి పొట్టిగా, దిట్టంగా, చామనలుపులో వున్నాడు. చురుకైన చిన్న కళ్లూ, సన్నముక్కూ, సన్నని పొడవాటి పెదాలపైన సన్నని, నల్లని మీసకట్టుతో దక్షిణాదిన కన్పించే ముఖం అతనిది. బుద్ధిహీనమైన లోకాన్ని చూచి గేలిచెయ్యడానికి సిద్ధంగా వున్నట్లుంటుంది. మాటకు ముందుగా గట్టిదైన తెల్లని పలువరుసమీద పొడుగ్గా సాగుతుంది సన్నని పై పెదవి. దాన్లో ఎడమ సగం కొద్దిగా సాగి నాలుగోపంతు పలువరుసను చూపిస్తుంది. కుడిసగం మాత్రం హాయిగా పూర్తిగా సాగి ఆ వైపు పలువరుస యావత్తునీ చూపిస్తుంది. ఆ నవ్వులోని వైచిత్రి చూపరుల నాకట్టుకుంటుంది. కొందరికి ఆ నవ్వులో మంచి తెలివీ, జ్ఞానమూ కన్పిస్తవి. చిన్నాకి ఎద్దేవానే కన్పిస్తుంది. శివరావు అతన్ని చూసి 'అసాధ్యుడిలాగున్నాడు!' అనుకున్నాడు.

చిన్నా ఊరినుంచీ పట్టుకొచ్చిన సరుకులూ, సామాన్లూ ఒక మూలన పెట్టాడు. శివరావుకు మంచినీళ్లిచ్చాడు. ఒక గిన్నెలో నల్లగా నిగనిగలాడుతున్న అల్లనేరేడుపళ్లు తెచ్చి నారాయణస్వామికిచ్చాడు.

ఆ నేరేడుపళ్లను చూచి "మా రెడ్డెమ్మ తల్లి పంపిందా?" అంటూ నవ్వినప్పుడు నారాయణస్వామి నవ్వులో ఎద్దేవా ఏ మాత్రం లేకపోగా నిండైన వాత్సల్యం తొంగిచూసింది.

కొన్ని పళ్లుతీసి శివరావుకిస్తూ "మీరు మా రెడ్డెమ్మగుండు చూడటానికి విశాఖపట్నంనుంచీ వచ్చారా?" అనడిగాడు. "వీడు మిమ్మల్ని బలవంతాన యిక్కడికి లాక్కొచ్చివుంటాడు!" అన్నాడు చిన్నాని చూస్తూ.

శివరావు నవ్వివూరుకున్నాడు.

"మనిషి అంటే హేతుబద్ధంగా ఆలోచిస్తూ జీవించే జంతువనో, జీవి అనో అంటాడు యీ రేషనలిస్టు. మనిషి అంతమాత్రపువాడే అయితే లోకంలోని అనంతకోటి జనుల్లో ప్రతిఒక్కడూ 'నే అంటూ ప్రత్యేక వ్యక్తిత్వం ఎలాపొందుతున్నాడు? ఇంత వైవిధ్ ఎలావచ్చింది?

బ్రతుకుగురించిన ఇచ్ఛ, లోపల్నుంచీ తోసుకొచ్చే కోరిక అనుభవాల్ని గురించిన కాంక్షలు - యివే మనిషి శీలాన్ని రూపొం స్తున్నవి! వాటికి తగినట్లుగానే మనిషి తన ఆలోచనలనల్లుకుంటున్నాడ ఆలోచనా విధానానికి మూలం కాంక్షఅనీ, మానసిక చైతన్యాని మూలం ప్రవృత్తి అనీ నిశ్చయంగా చెప్పవచ్చును! మనిషి త వ్యక్తిత్వపు పరిధినుంచీ, స్వార్థ ప్రవృత్తినుంచీ బయటపడగల బు అయితేతప్ప సామాన్య మానవుడు యీ బంధంనుంచీ తప్పించుకోలేడ తన ఆలోచనలను తాను హేతుబద్ధంగా నడుపుకొని అవి ప్రసాదిం బుద్ధి, చైతన్యాల వెలుగులో తన శీలాన్ని మలచుకోగలనని అ కోవటం పొరపాటని ఫ్రాయిడ్ ఋజువు చేసాడు. ఆ పని చెయ్యబో ఓడిపోయినవారేగదా అతని పేషంట్లు! వేలమంది మానసిక రోగు మీద పరిశోధనలు చేసి, చేసి తన సిద్ధాంతాన్ని తయారు చేశాడ ప్రయోగఫలితాలు ఆతనికి సర్టిఫికెట్లనే యిస్తున్నవి. 'మనిషి ప్రవృ అన్నది నీతికీ, తర్కానికీ సహజంగా కట్టుబడివుండే తత్వం గల అన్న హేతువాద విశ్వాసాన్ని అతని శాస్త్రీయ దృక్పథం కొట్టి పా సింది. ప్రవృత్తియొక్క స్వరూపంతో నీతికీ, తర్కానికీ సంబంధ లేదనీ అది వుత్త పొగరుబోతు, తిక్కమాలోకం అనీ; నీతి,నియమాలు హేతుబద్ధతా దాని పైపై వేషమేనని తేల్చాడు! మనిషి ఒక అపా జలరాశి అయితే దాని పైపై నురగ మాత్రమే ఈ మానసిక చైతన్య ఎంత గొప్ప సిద్ధాంతానికైనా వెనుక దానిని నిర్వచించినవారి ప్రవృ కీలకంగానే వుంటుంది! అందుకే తత్త్వశాస్త్రాలంటేనూ, సిద్ధాంత లంటేనూ, వాటిని పట్టుకు ప్రాకులాడే వాళ్లంటేనూ నాకు మహ చీకాకు!

"నిర్దిష్టమైన లక్ష్యాలతో హేతుబద్ధంగా ఆలోచించి ఆ ప్రకార జీవించే జంతువే మనిషి అన్న సిద్ధాంతం రూసో కాలంలో జబ్బు పడి, కాంట్ కాలంలో మంచంపట్టి, షోపెన్ హోవర్ కాలంలో చచ్చూరుకుందన్న మాట వీడింకా వినలేదుమరి!" అతని నవ్వు మ ఎక్కువ వంకరగా సాగింది. మరింత హేళనని గుమ్మరించింది.

చిన్నా శివరావువైపు నిస్సహాయంగా చూశాడు. తాను చెప్ప లేకుండా వున్న గట్టి సమాధానం ఏదో శివరావు చెప్పాలన్న అభ్యర్థన ఉన్నదా చూపులో. కాని శివరావు ఏమీ మాట్లాడకుండా వింటూ వుండి పోయాడు.

అంతశ్చేతన గురించి తెలుసుకుంటే సత్యం అందుతుందని నేటి ఫెనామినాలజీ అంటున్నది. దానికి రాజయోగధ్యాన పద్ధతికీ దూరప

బంధం లేదంటారా? ఇహ అందులోంచీ పుట్టుకొచ్చిన ఎక్సిస్టెన్షియ ం మనిషి ఏకాకి అంటూ మన మామూలు దేవుణ్ణి తోసిపారేసి; మనిషి టరి తనాన్ని గుర్తించి; అతను తన జీవితానికి అర్థం తానే వెతుక్కోలనీ, తనవైన విలువల్ని తానే నిర్మించుకోవాలనీ తీర్మానించి; నిషికి అనంతమైన స్వేచ్ఛనీ, అనంతమైన బాధ్యతనీ కూడా యిచ్చి తనికి పట్టం కట్టిన నిజమైన మానవతావాదం కదా! అది సంఘాన్ని తంత్రులైన వ్యక్తుల సమూహంగా గుర్తించింది గాని 'సంఘమే త్యం, మనిషి బానిస' అనడాన్ని నిరాకరించింది! పదార్థాన్ని త్యంగా స్వీకరించి గొప్ప శాస్త్రాన్ని తయారు చేసి, సాంకేతిక ంగంలో అఖండ విజయాల్ని సాధించి, సాధించి ఆఖరికి భౌతిక స్త్రం గుర్తించింది - భౌతిక పదార్థానికి మూలంగా వున్నది క్తి అనీ, దానిలో అనిశ్చితతత్త్వం వుందనీను! భావాతీత ధ్యానానికి పపంచ వ్యాప్తంగా ఎంత ప్రాచుర్యం వచ్చింది! శాస్త్రీయమైన రిశోధనలు దాని సత్ఫలితాలను ధృవపరచినవి గదా!

వ్యక్తి - శక్తి - చేతన అన్నవాటికి ప్రపంచం నలుమూలల నుంచీ ఏక కాలంలో యింత గుర్తింపు రావటం, ఆత్మబోధకోసం యిన్ని ప్రయత్నాలు జరగటం —— ఇవేమీ గుర్తించకుండా ఎప్పటిదో పద్ధెనిమిదో శతాబ్దపు హేతువాదాన్ని పట్టుకుని ఊరేగటం వీడికి గొప్ప ఆధునికతగా వున్నది! హేతువు పరిమితులు నిర్ణయింపబడి, బుద్ధి వ్యాపారం దర్శనాలకు వస్తువైపోయి ఎంత కాలమైంది!

ఇవేవీ తెలియకుండానే మానవజాతి సాధించిన విజ్ఞానమంతా పీడిసొత్తే అయిపోయినట్లు ఎగిరి ఎగిరి ఆఖరికి తనంత మేధావిలేడని నమ్ముతున్నాడు! అందుకని అప్పుడప్పుడు 'కాస్త చదివి, తెలుసుకోరా!' అని చీవాట్లు పెడుతుంటాను లెండి! అన్నాడు నారాయణస్వామి.

చిన్నా మొహం చూస్తే జాలేసింది శివరావుకు.

"ఆ వయసులో వాళ్ళ అలోచనా ధోరణికీ, ప్రవర్తనకీ మూలమైన ప్రవృత్తి - అది కేవలం తెలుసుకోవటం కాదు - అది తిరుగుబాటు తత్త్వం. అది సహజమేకదా ఆ వయసుకు!" అని నవ్వాడు.

"బాగా దెబ్బతీశారు నామీద!" అన్నాడు నారాయణస్వామి నవ్వుతూ.

"ఇంతకూ మీరు దేన్ని నమ్ముతారు?" అన్నాడు శివరావు.

"నన్ను! నన్ను తప్ప దేన్నీ నమ్మను!" అని గట్టిగా నవ్వాడు నారాయణస్వామి.

## ౬

ఇంతలో ఒక కుటుంబం గుహముందుకు వచ్చి ఆగారు. సంచీలో నుంచీ పళ్లూ, పూలూ తీసి నారాయణస్వామి పాదాలముందుంచారు. భక్తితో కళ్లుమూసుకుని నమస్కారాలు చేసుకున్నారు.

"కుంకుమైనా, విభూతి అయినా వుందా సామీ?" అడిగింది గృహిణి.

నారాయణస్వామి వ్రేలితో ఒక మూలకు చూపాడు. భార్యాభర్తలిద్దరూ అటువైపు వెళ్లి ఒక మూకుట్లోంచీ కుంకుమ తీసుకున్నారు. అందర్నీ అడిగి హడావుడీ చేసి ఒక కాగితమ్ముక్క సంపాదించి కొంచెం కుంకుమ అందులో పొట్లం కట్టుకున్నారు. నేల మీద కూర్చుని చూస్తున్న తమ పసిపాప ముఖాన కాస్త కుంకుమ అంటించారు. ఈ తంతు అంతా పూర్తయ్యాక నారాయణస్వామికి భక్తితో నమస్కరించి ఆకాశంవైపు చూసి లెంపలు వేసుకున్నారు. గృహిణి నమస్కార ముద్రతో మూడుచుట్లు తిరిగి ప్రదక్షిణ చేసుకుని కూర్చుంది.

తల్లి ప్రక్కన కూర్చోగానే క్రింద కూర్చుని వున్న పసిపాప నవ్వుకుంటూ లేచింది. మెల్లగా ముందుకు ఒక్క అడుగువేసి చతికిలబడిపోయింది. దెబ్బతగిలిందేమో ఏడవటానికి సిద్ధపడుతూ ముఖం చిట్లించింది. కాని అమ్మా, నాయనా తనను చూసి నవ్వటం చూచి తానూ నవ్వేసింది. మళ్లీ లేచింది. మళ్లీ పడ్డది.

అందరూ మాటలాపేసి ఆ పాప ప్రయత్నాల్ని చూస్తూ వుండిపోయారు. కొంతసేపు చూసి నారాయణస్వామి అన్నాడు: "చిన్నా, ఆ పాప లేచి నడవాలని ప్రయత్నిస్తున్నది, చూడు! అందరు మనుష్యులూ లేచి నిల్చుని అడుగుతీసి అడుగువేస్తూ ముందుకు కదుల్తున్నారు. నేనూ అలానే లేచి నిల్చుని వాళ్ళలాగే అడుగుతీసి అడుగు వేస్తే ముందుకు వెళ్లొచ్చును! అన్న హేతుబద్ధమైన ఆలోచన ఆ పాపకు లేదు. కాని అటువంటి ఆలోచన వుంటే ఎలా ప్రవర్తిస్తారో అలాగే ప్రవర్తిస్తున్నది. నిజంగా బుద్ధి పూర్వక లక్ష్యం లేకున్నాకూడా, అలాటి లక్ష్యం వున్నట్లు ప్రవర్తించడాన్నే సహజ ప్రేరణ అనీ, ఇన్‌స్టిన్‌క్ట్ అనీ అంటారు. హేతుపూర్వకమైన ఆలోచనకంటే అదే బలవత్తరమైనది. అదే మనిషినీ, జాతినీ ఒక తీరున నడిపించేది.

మనిషిలో పుట్టే ఈ ప్రేరణని అర్థం చేసుకోవడానికీ, అర్థం చేసుకోవడంద్వారా దాన్ని కొంత క్రమబద్ధం చెయ్యడానికి మనిషిలోని హేతుత్వం ప్రయత్నిస్తుంది. దాని ప్రయోజనం అంతవరకే!... యిదే షోపెన్ హోవర్ మొదటగా చెప్పి నిరూపించిన విషయం!"

నారాయణస్వామి మాటల్ని నవ్వు ముఖాల్తో శ్రద్ధగా విన్నారు దంపతులు. తమ సంపూర్ణమైన ఒప్పుదలను తెలియజేస్తూ ఉమ్మడిగా తలలూపారు.

"కాసిని చల్లటి మంచినీళ్లిప్పించు సామీ !... మాకు మల్లే వచ్చిన భక్తులు కూర్చోవటానికి కాసంత పందిరీ, తాగటానికి నీళ్లూ ఏర్పాటు చేస్తే తమరిని బాధించకుండా నమస్కారం చేసుకుని వెళ్లిపోదుము గదా, సామీ" అన్నాడు గృహస్థు.

చిన్నూ లేచి చెంబుతో కుండలోని చల్లని నీళ్లు తీసి వాళ్లకు గ్లాసుల్తో అందించాడు. వాళ్లిద్దరూ తృప్తిగా నీళ్లు త్రాగి, పిల్లకు త్రాగించి, ఆ నీళ్ల చేతుల్తోనే ముఖాలు తుడుచుకున్నారు.

"రెడ్డెమ్మగుండు చూసుకున్నాం. తెట్టు వేణుగోపాలసామిని దర్శించుకుందామని యిటు వచ్చాం. మా పుణ్యాన మీ గుహ కంటబడ్డది. దర్శనం చేసుకున్నాం. ఇహ పోయొస్తాం సామీ !" అని సెలవు పుచ్చుకుని వెళ్లిపోయారు.

"ఎక్కడో మూలన కూర్చుని సొంత విలువలు వెతుక్కునే వాళ్లని ఎంత గౌరవిస్తారో చూడండి మన ప్రజలు." అంటూ శివరావుని చూసి వ్యంగ్యంగా నవ్వాడు నారాయణస్వామి. "నేనూ దేవుణ్ణి చూడలేదు. చూడనిదాన్ని నమ్మే గుణమూ లేదు. కాని యిట్లా వచ్చేవాళ్లు, పాపం, ఆ నమ్మకం లేకపోతే బ్రతకలేరు అందుకని ఆ కుంకం తెప్పించిపోశాను....ఇంకొన్నాళ్లకి భక్తుల సౌకర్యార్థం - ఇంతకు ముందు వాళ్లు కోరినట్లు - ఇక్కడొక మఠం వెలిసినా ఆశ్చర్యం లేదు !" అన్నాడు జరిగిన దానికి సంజాయిషీ చెప్తున్నట్లు.

శివరావు నవ్వాడు.

చిన్నూ కోపంపట్టలేనట్లు ముఖం మాడ్చుకున్నాడు.

వాళ్లిద్దర్నీ పరిశీలనగా చూసి నారాయణ స్వామి గంభీరంగా అన్నాడు: "కాని వాళ్ళని చూసి నవ్వాల్సినదానికంటే మనకు అసూయ పడాల్సిందే ఎక్కువుంది. ఎందుకంటే, జీవితంలో మనం యింత పరిణతి చెందిన మేధతో సాధించలేని తృప్తినీ, శాంతినీ వాళ్లు ఆ జీవన విధానంలోనుంచీ పొందుతున్నారు. మనకు పుక్కిటిపురాణాలుగా కన్పిస్తున్నవే వాళ్లకు మానవ జీవితానికి అర్థమూ, భాష్యమూ చెప్తున్నవి !... అట్లాగని మనం కాలాన్ని వెనక్కు తిప్పలేము, మన బ్రతుల్ని వెనకటి కాలానికి మరలించుకోవటమూ వాంఛనీయం కాదు ! ...వాళ్లని అర్థం చేసుకోవడమే మన పరిణతి !"

"ఇట్లా కారణాలు చెప్పుకుంటూ మానవజాతిని యింకా యిం మౌఢ్యంలో వుంచెయ్యాలనుకోవడం దారుణం !" చీకాకుగా, కోపం అన్నాడు చిన్నూ.

"ఏమిటో అంతదారుణం ?" వెక్కిరింపుగా అన్నాడు నారాయణస్వామి.

"ఏమిటా ? ....మానవత్వపు విలువలు వికసించటంపోం: మూర్ఖత్వమూ, అజ్ఞానమూ ప్రబలిపోతవి యిటువంటి మౌఢ్యం వలన" అన్నాడు చిన్నూ.

"మానవతా భావపు పునాది హేతువాదంలో వున్నదా ?మానవతా భావం అంటూ ఉన్నచోట అది మనిషి స్వభావంగా, ప్రవృత్తిగానే వుంటున్నది....దాన్ని వికసింపజేసే తత్త్వం తర్కజ్ఞానంలో లేదు. అది హేతువాదం వల్ల రాదు. అటువంటి ప్రయత్నానికి జన్మస్థానం హృదయమేగాని మేధ కానేకాదు !" అన్నాడు నారాయణస్వామి.

"మీరు చెప్తున్నది ఒక పద్ధతి భాష్యం!" అన్నాడు శివరావు తటస్థంగా.

నారాయణస్వామి శివరావును చురుగ్గా చూశాడు. "అన్ని శాస్త్రాలూ, సిద్ధాంతాలూ మీరు చెప్పినట్లు ఏదో ఒక పద్ధతి భాష్యాలే! అంతకంటే గొప్ప సత్యాలేమీ కావు !... చుట్టూ కన్పిస్తున్న ప్రపంచానికీ, తాను లోనౌతున్న అనుభవాలకూ తనకు సంతృప్తినిచ్చే అర్థం చెప్పుకోవటానికి సహాయపడుతుంది హేతుత్వం. దాని పరిమితి అది. అంతే కాని చుట్టూ వుండే ప్రపంచాన్ని అది సృష్టించలేదు. అనుభవాలను అది పుట్టించలేదు ! భౌతికస్థాయిలో అది చాల ఉపయోగకరమైనది. కాదనటంలేదు. కాని మనిషి ప్రవృత్తిలో దాని పరిధి చిన్నది. మనిషి స్వభావతః స్వతంత్రుడు. అతని సహజ ప్రవృత్తులే అతనికి గీటురాయి. స్వేచ్ఛలో తనదైన అనుభవంద్వారా తప్ప ఎదగలేని స్వభావం కలవాడు. అతన్ని హేతుత్వం మలచలేదు ! మార్చనూలేదు !" అన్నాడు.

"స్వేచ్ఛ ! దేనికి స్వేచ్ఛ ? అజ్ఞానంలో కూరుకుపోయి భావ దాస్యంలోనూ, భౌతిక దాస్యంలోనూ కొట్టుమిట్టాడటానికా స్వేచ్ఛ ? స్వేచ్ఛ ఎవరిక్కావాలి ? కడుపు నిండనివాడికి దానితో పనిలేదు. కడుపు నిండినవాడు తీరిగ్గా కాళ్లు బారచాపుక్కూర్చుని మనస్సు తృప్తి, అనుభూతి అంటూ కబుర్లు చెప్పుకోటానికి పనికొస్తుంది,

ంతే!... అసలు స్వేచ్ఛ అనేది ఎక్కడుంది? దాన్ని నిలుపు న్న వ్యవస్థ ఎక్కడుంది? పాత వ్యవస్థలో పాదుకుపోయిన నస్సు దానితాలూకు దాస్యాన్నే స్వేచ్ఛ అంటుంది!" స్వేచ్ఛ న్న పదం తనకు సరిపడని విషయమైనట్లు కోపంగా, ఆవేశంగా న్నాడు చిన్నా.

ఆ ఆవేశానికి పగలబడి నవ్వాడు నారాయణస్వామి.

"శరీరమూ, మనస్సూ రెండూ కలిస్తేనే మనిషి! శరీరమెంత జమో, కన్పించనిదైనా మనస్సూ అంత నిజమే! రెండింటికీ దేని వసరాలు దాని కున్నవి...నీవు ఇన్నాళ్ళకి ఒక తెలివిగల మాట ూట్లాడావురా చిన్నోడా! పాతవ్యవస్థలో పాదుకుపోయిన మనసు ాని తాలూకు దాస్యాన్నే స్వేచ్ఛగా భ్రమిస్తుంది! భవిష్యత్తును ురించిన కొత్తకలల్లో పాదుకున్న మనస్సు ఆ కలలకు చేసే ాస్యాన్నే స్వేచ్ఛగా భ్రమిస్తుంది. మనస్సు లక్షణమే అది! ఎప్పటి కప్పుడు ఈ సంకెళ్లను విరగ్గొడుతూ పోవటమే అది అనుభవించగల స్వేచ్ఛ!"

శివరావు ఆసక్తితో గుహనంతా కలయజూశాడు. అతనిచూపు ఒక మూలన షెల్ఫులో వున్న పుస్తకాలమీద పడ్డది. అవి పాతబడి పోయిన పుస్తకాలుగా తోచలేదు. కొత్త అట్టలు పలురంగుల్లో వెలుగు తున్నవి. అన్నిటికంటే పైన నల్ల అట్టమీద ఎర్రని అక్షరాల్తో వున్న లావుపాటి పేపర్ బాక్‌ను చూసి దగ్గరికెళ్లాడు. అతనను కున్నట్లు అది 'ది డాన్సింగ్ వూలీ మాస్టర్స్'. దాని ప్రక్కన ఆర్థర్ కోస్లర్ వ్రాసిన పుస్తకం వుంది.

"ఋషివాలీ మా ఎదురుగానే వుంది కదా, ఈ పుస్తకాలు అక్కడి మిత్రులు తెచ్చి యిస్తుంటారు" అన్నాడు నారాయణస్వామి.

"విజ్ఞానం ఉరుకులూ పరుగుల్తో ముందు కెళ్తోందిగదా! మా చిన్నా పని లేకుండా ఖాళీగావున్నాడు కదా అని యిక్కడకు వచ్చి యీ పుస్తకాలు చదవరా అని చెప్తుంటాను. వాడు వినడు...భౌతికం అన్న పదాన్ని మహా ఆత్మీయంగా ఎంచుకుని, ప్రాణప్రదంగా ప్రేమించి, అందరిమీదా బ్రహ్మాస్త్రంలా ప్రయోగిస్తుంటాడులెండి. వాడి అసలు రూపం చూడాలంటే యిక్కడ కనపడదు. వాడితోటివాళ్ళదగ్గర చూడాలి!...అసలు భౌతికం అన్న పదానికి అర్థంతెలుసేమిట్రానీకు... పదార్థాన్ని శక్తిగానూ, పదార్థంగానూ కూడా దర్శించుకోవచ్చునని శాస్త్రం ఋజువుపరిచాక భౌతికం అన్నపదానికి అర్థమేమారిపోయింది గదా! పంచేంద్రియాలు గ్రహించగల స్థూలపదార్థంగా ఆరంభమై, నిశ్చితమైన శాస్త్రీయపుసూత్రాలకు కట్టుబడివుండే సూక్ష్మపదార్థంగా విస్తరించి, ఈనాడు అనిశ్చితమూ, స్థూలప్రపంచపు శాస్త్రీయసూత్రా లకు కట్టుబడనిదీ అయిన శక్తిగా గుర్తింపుపొందిన యీ 'భౌతికం' బ్రహ్మపదార్థం అయిపోయిందికదా!" అని శివరావువైపు తిరిగాడు.

"మీరుబాగా చదువుకున్నవారు. సబ్‌అటామిక్ ఫిజిక్సూ, క్వాంటం మెకానిక్సూ ఆవిర్భవించాక తత్త్వశాస్త్రంలో భౌతికశాస్త్రం భాగం అయింది కదా! మనసుకీ, విశ్వానికీ మధ్యనుండే అవినాభావ సంబంధం, నీవు గమనించినంతనే మారుతూవచ్చే విశ్వం - ఇంత వరకూ పురాణాలను పుక్కిటిపురాణాలుగా చేసిన శాస్త్రవిజ్ఞానం యిప్పుడు ఆ పురాణాలనే చప్పిడి పురాణాలుగా మార్చేంత అద్భుత గాథగా రూపొందింది!

"క్వాంటం ఫిజిక్సూ, ష్రోడింగర్ ఈక్వేషనూ, బ్లాక్‌హోల్సూ, క్వాసార్సూ అంటూ ప్రయాణిస్తున్న భౌతికశాస్త్రం నెగెటివ్‌టైంనీ, అనేక దేశ కాలాల్లో ఒకేమనిషి ఒకేసారి వుండటం సాధ్యమేనన్న అనుమానాల్నీ చూపుమేరలోకి తెచ్చిందంటే- తర్వాత రాబోయే సిద్ధాంతం అద్వైత వేదాంతమూ, ఆదరణ పొందబోయే సాహిత్యం జ్ఞాన వాశిష్ఠమూ, త్రిపురా రహస్యమూ కావచ్చు!" అన్నాడు.

శివరావ్ నవ్వాడు. "ఈ శతాబ్దపు ప్రారంభంలో జార్జి శాంతయానా అన్న దార్శనికుడు ఈ విషయంగురించి చక్కగా చెప్పాడు. ప్రవృత్తి అన్నది హేతుబుద్ధికి శత్రువు కాదన్నాడు. సహజ ప్రవృత్తులతో సంబంధంలేని ఆలోచన మనిషిని పిచ్చివాడిగా చేస్తుంది. ఆలోచనతో సంబంధంలేని ప్రవృత్తులు మనిషిని జంతువుగా దిగ జారుస్తవి. ఈ రెండింటి కలయికేమనిషి. సహజప్రవృత్తులు మానసిక చైతన్యపు పరిధిలోనికివచ్చి సామరస్యం పొందటమే హేతుబుద్ధి అన్నాడు.

"శాస్త్రీయవిజ్ఞానం అంటే మనిషి అనుభవంలో కన్పిస్తున్న కొన్నినియతుల్ని క్రోడీకరించటం మాత్రమేననీ, ప్రపంచాన్ని శాసించే అనుల్లంఘ్యమైన చట్టాలుకావనీ అతనికి బాగాతెలుసు. అయినాకూడా బుద్ధి, అదిసాధించే విజ్ఞానం మాత్రమే మనిషిని ముందుకు తీసుకెళ్ల గల శక్తికలిగినవని అతని నమ్మకం."

"అతను భౌతికవాది. మనిషిలోపుట్టే ప్రతిఊహకీ, చలనానికి చైతన్యానికికూడా ఏదో భౌతికమైన హేతువు వుంటుందని అతని

విశ్వాసం. మానసిక పరిణామాలకు మూలకారణాలైన భౌతిక నియమాలను కనుక్కున్నప్పుడే మనస్తత్వశాస్త్రం సాహిత్యస్థాయినుంచీ విజ్ఞానశాస్త్రపు పరిధిలోనికి వెళ్ళగలదని అన్నాడతను..."

శివరావు చెప్తుంటే ఆత్రంగా, ఆబగా ముందుకు వంగి వింటు న్నాడు చిన్నా. అతని ముఖంలో తృప్తి, గర్వం తొంగి చూస్తున్నాయి.

నారాయణస్వామి నవ్వాడు. మీరు పరిశోధనలు సల్పుతున్న పేరా సైకాలజీ ప్రాథమిక స్థాయిలో కార్యకారణ సంబంధానికి లోబడి వున్నట్లు కన్పిస్తుంది. కాని మరెన్నో విషయాల్లో దాన్ని దాటిపోయింది.

"కార్ల్‌యుంగ్ అన్న ప్రఖ్యాత మనస్తత్వ శాస్త్రవేత్తచే ప్రతిపాదింపబడి, ఆర్థర్ కోస్లర్ ప్రచారంలోకి తెచ్చిన 'సింక్రోనిసిటీ' ఒక ఉదాహరణ. ఈ కాకతాళీయ న్యాయంలో కాకి తాటి పండుమీద వాలబోతూ వుంటుంది. తాటిపండు రాలడం ప్రారంభిస్తూ వుంటుంది. కాకి వాలబోతున్నదని తాటిపండుకి తెలుసా? తెలిసే రాలడం మొదలెట్టిందా? ఎవరూ ఋజువు చెయ్యలేని విషయం. ఆ ఋషీవాలీలో సుందరం గారున్నారు. అతనికి నాదగ్గరకు రావాలన్న ఊహ కల్గింది. నాకు అకారణంగా అతని గురించిన ఆలోచన వచ్చింది. కొద్దిసేపట్లో అతను నాదగ్గరకు వచ్చాడు. నా ఊహ అతని రాకను గాని, అతని ఊహ నా ఆలోచనను గాని ప్రభావితం చేసిందనటానికి ఋజువుండదు. ఇక్కడ కార్యకారణ సంబంధం ఎలా అన్వయించాలి? అతని రాక జరుగబోతున్న విషయం. అది అతన్లోనూ, నాలోనూ కూడా ప్రతిఫలించింది! అనుకోవాలి...... గమనించే దృష్టి వుంటే ఇటువంటి ఉదాహరణలు ఎన్నో నిత్యజీవితంలో అనుభవంలోకి వస్తూనేవుంటవి... పాత కాలంలో దయ్యాలూ, భూతాలూ లాగా! అవి ఉన్నాయని నమ్మిన కాలంలో ఉన్నట్లు నిదర్శనాలు కన్పించాయి. లేవని నమ్ముతున్న కాలంలో లేనట్లు ఋజువులు కన్పిస్తున్నాయి! దృక్కోణం మారినప్పుడు వాటి ఉనికి మారిపోతూ వుంటుంది! ప్రయత్నిస్తే ఏ సందర్భంలో నైనా కార్యకారణ సంబంధం కన్పిస్తుంది...... నిజానికి యీ కార్యకారణ సంబంధం శాస్త్రీయ విజ్ఞానంతోపాటు, మారుతున్న దృక్పథంతోపాటు రూపొందుతూ వస్తున్న ఒక భావనే గాని అంతకుమించినది కాదు! హేతువాదం కూడా వీటితోపాటు పరిణామం చెందుతూ రూపొందుతూ వస్తున్న ఒక ఉద్యమమే.

"అట్లాగన్నానని నేను హేతుత్వాన్ని చిన్న చూపు చూస్తున్నాననుకోకండి. కీకారణ్యం లాంటి జీవితంలో మనిషికి కన్పించే మార్గమే హేతువు! స్థూలప్రపంచంలోనూ, లౌకిక జీవితంలోనూ దాని ప్రభావాన్ని ఎలా నిరాకరించగలను?!

"మీ మాటల ధోరణి బట్టి నేను ఊహించుకున్నాను; నే హేతువాదానికి వ్యతిరేకిననీ, ఛాందసుణ్ణనీ మా చిన్నా మీకు చె వుంటాడు. 'నేను హేతువాదిని' అంటే అందులో 'నేను' అన్నప నాకు ముఖ్యం. హేతువాదం అన్నపదం వాడికి ముఖ్యం. అదీ తేడ

"హేతువాదాన్ని ఋజాన్నేసుకు తిరిగేవాళ్ళు ఒక్క విషయ గమనించాలి. శాస్త్రవిజ్ఞానం కేవలం వ్యక్తి హేతుత్వం చేసే ప్రయ త్నానికి ఫలితమే అన్న భ్రమ తొలగాలి. విప్లవాత్మకమయిన భౌతిక గణిత శాస్త్ర రహస్యాలు వ్యక్తుల ప్రయత్నపూర్వకమైన ఆలో నల్నుంచీ పుట్టలేదు! ఆలోచించి, ఆలోచించి ఒదిలేశాక నిద్రలోనుంచీనో మరో అసంకల్పిత భాగం నుంచీనో వచ్చిన వెలుగులే అతిముఖ్యమై సిద్ధాంతాలుగా రూపొందాయి. హెల్మ్ హోల్ట్‌స్ అన్న ప్రఖ్యా భౌతికశాస్త్రవేత్త తనకు క్లిష్ట సమస్య ఎదురైనప్పుడు దాన్ని గురించి విషయమంతా క్షుణ్ణంగా చదివేవాడట. ప్రయత్నపూర్వకంగా ఎంత ఆలోచించినా రాని సమాధానం షికారుకెళ్తున్నపుడో, స్నానం చేస్తున్నపుడో అప్రయత్నంగా మనసులోకొచ్చేదని గుర్తించాడు. డార్విన్ తనకు ఎప్పుడో ఒకప్పుడు తోచే, అవసరమైన ఆలోచనలన్నీ వ్రాసి పెట్టుకోవడానికి జేబులో కాగితాలు పెట్టుకునుండేవాడట!

"ఈపరిస్థితి సైకాలజిస్టులు ఒకరకంగా అన్వయం చేసుకున్నారిప్పుడు. ...వ్యక్తచేతనలో జరిగే ఆలోచనల్లో సమాధానం లభించని క్లిష్టమైనభాగం సుప్తచేతనలో మథించబడి ఫలవంతమౌతుందన్న విషయం శాస్త్రాల్ని రూపొందించిన శాస్త్రజ్ఞులకు తెలుసు. సైకాలజిస్టులు దానినే సబ్‌కాంషస్ ఎలాబరేషన్ అంటున్నారు.

"కాబట్టి చాలవరకు శాస్త్రజ్ఞుడైన వ్యక్తి తన చేతనావరణంలోకి వచ్చిన సత్యాల్ని హేతుబద్ధం చెయ్యడం జరుగుతున్నది....

"శాంతయానా చెప్పిన 'జంతుప్రత్యయం' గురించి నేనూ విన్నాను. అటు అద్వైతమూ, ఇటు సబ్‌అటామిక్ ఫిజిక్సూ ఎన్ని మహత్తర చరమ లక్ష్యాలను ప్రతిపాదించినా, నేనూ, నా చుట్టూవుండే ప్రపంచమూ నియతాలే! ఎంత తత్త్వం తెలిసినా వేళతప్పి అన్నం తింటే నాకు అరగదు. ఎండనీ, చలినీ ఓర్చుకోలేదీ శరీరం. రోజూ సూర్యుడు తూర్పుదిక్కునే ఉదయిస్తాడు... కాబట్టి నేనూ శాంతయానాతో ఏకీభవించాల్సిందే!

"అతనుచెప్పే హేతుబుద్ధికీ, చిన్నా హేతువాదానికీ చాలాభేదం వుంది, గమనించారా? శాంతయానా హేతుబుద్ధి వ్యక్తిప్రవృత్తిలో నిష్ఠమైనది. మనిషి సహజ ప్రవృత్తుల్ని పరిగణనలోకి తీసుకుంటు

ని. మనిషిని వ్యక్తిగా గుర్తిస్తున్నది. చిన్నూ హేతువాదం భౌతిక ర్థాన్ని మాత్రమే గుర్తిస్తున్నది. వాడు టెక్నాలజీని గౌరవిస్తాడు. ి దృష్టిలో మనిషి ఒక వస్తువుమాత్రమే. రాగద్వేషాలూ, యిష్టా ాలూ, సుఖదుఃఖాలూ అనుభవిస్తున్న జీవికాదు!...” అంటూ ాడు నారాయణస్వామి.

తర్వాత ఆర్ద్రస్వరంతో మెల్లగా అన్నాడు: “కాని ఏ శాస్త్ర గతీ జీవితాన్ని, దాని అనుభూతినీ నిర్వచించలేదు! ప్రకృతిలో కనేమిగా వెల్లివిరిసే నవజీవన చైతన్యం, మొలకెత్తుతున్న విత్తనం, సిస్తున్న పువ్వూ, పసిబిడ్డ నవ్వూ – వీటికి ఏ తత్త్వశాస్త్రమూ ్యము చెప్పలేదు! ఈ కొండలూ, ఈ వైశాల్యమూ, ఈ ఆకాశమూ -వీటిలో లభించే ప్రశాంతిని ఏ శాస్త్రమూ ఇవ్వలేదు!

...ఇది ప్రశాంతి మాత్రమే కాదు! ఇది పవిత్రత! ఇది ందర్యం! దేశ కాలాలకతీతమైన ఈ చోటినుంచే మనిషి మనసుకు దీ అందకుండా ఉవ్విళ్లూరిస్తూ పైకి లాక్కెళ్లే కలలూ, భావలోకాలూ ్టుకొస్తాయి!... మానవ జీవితపు వచనకావ్యంలోని రసమయ త్తు అది!”

అంటూ కొంచెమాగి శివరావును చూసి మొహమాటంగా నవ్వాడు. ఎక్కువగా మాట్లాడటం–ముఖ్యంగా యిటువంటి విషయాలు మాట్లా ం నాకు యిష్టం వుండదు – ఇవాళ ఎందుకో అనవసర ప్రసంగం లా చేశాను” అన్నాడు.

శివరావు ఆవులింతనాపుకున్నాడు కష్టంమీద. కొంతకాలం నుంచీ ్యూషన్‌లోకొచ్చిన యిటువంటి ధోరణులు అతనికి క్రొత్త కాదు. మానవ కృతిలోని అనివార్య ద్వంద్వప్రవృత్తి శాస్త్రీయతలో కూడా స్ఫుటం కావడాన్ని ప్రపంచ వ్యాప్తంగా మేధావులు చర్చిస్తున్నారు ఎమే. కాని యీ తర్కం మానవ జీవితాన్ని పరిపుష్టం చెయ్యడానికి యోజనకారి కాదు! మానవుడు హేతువును ఆధారంగా చేసుకుని హా శక్తివంతుడుగా, విజేతగా రూపొందుతున్నకాలం యిది. గ్రుడ్డి వేశాలూ, ప్రవృత్తులూ అతన్ని ఆడిస్తున్నాయనీ, అతని ప్రవర్తనను మలుస్తున్నాయనీ చెప్పుతుంటూ చేతులు ముడుచుకు కూర్చోవటం మనిషికి లక్ష్యం కారాదు! అది మానవ స్వభావానికీ, ప్రగతికీ విరుద్ధం!... హేతువుకు మూలం ప్రవృత్తి అయితే ప్రవృత్తికి మూలమైనదేదో ఎవరు చెప్పగలరు?!... తన తోకను తానే నోట గరచుకొని మ్రింగ ప్రయత్నిస్తున్న సర్పం ... దానికి సమాధానం, సమన్వయం ఎక్కణ్ణుంచీ వస్తవి?... ఈ వాదనల వలన ప్రయోజనం శూన్యం! అనుకున్నాడు శివరావు. అతనికి యిక్కణ్ణుండీ తొందరగా బయటపడాలని వున్నది.

“ఒరే చిన్నూ, ఇక్కడ భక్తులిచ్చిన సరకు చాల చేరిపోయింది. తీసుకెళ్ళి రెడ్డెమ్మతల్లి కివ్వరా. ఇవన్నీ ఆ జాతికి చెందాల్సినవే న్యాయంగా” అంటూ ఆగి “నీ సర్వీస్ కమీషన్ రిజల్టు తెలిసిందా? .... ఈ సారి సెలక్టవుతావులే, ఇవాళ ఆస్తికులకు మంచినీళ్ళిచ్చి పుణ్యంకట్టుకున్నావు గదా!” అన్నాడు నారాయణస్వామి వేళాకోళంగా.

సంచులు సర్దుతున్న చిన్నూ విసురుగా తలెత్తి “నేను మంచి నీళ్ళిచ్చింది ఆస్తికులకు కాదు – దాహంతో వున్న మనుష్యులికి!” అన్నాడు.

“ఆ దాహం పుచ్చుకున్న మనుష్యులే ఆస్తికులు! నీ పుణ్యం వృథాపోదులే!” అని నారాయణస్వామి అంటూంటే ఉడుక్కుంటూ సంచులు చేతిలోకి తీసుకున్నాడు చిన్నూ.

“వీడికింకా పసితనం ఒదల్లేదు! ఆ ఉడుకుమోత్తనం చూడండి! మొఖం ఎంత ఎర్రగా చేసుకున్నాడో!... ఇంకో నెల రోజుల వరకూ యిటు తొంగి చూడడు!” అని నవ్వాడు నారాయణస్వామి.

వాళ్లిద్దరి సంబంధబాంధవ్యాలు చూస్తుంటే శివరావుకు ఏమిటోగా అన్పించింది. తన అనుభవంలోలేని, తానెరుగలేని యీ బంధాలూ, బాంధవ్యాలూ గమనిస్తుంటే ఒక వ్యర్థతాభావం గుండెమీద బరువుగా కూర్చుంది. ఊపిరి సలుపనట్లై చెమటపట్టేసింది. ముక్తసరిగా సెలవు తీసుకుని చిన్నూతో తిరుగుముఖంపట్టాడు.

[ ఇం కా వుం ది ]